డబ్బూ ....రికమండేషనూ లేని జోకర్లు.

"చాలా త్వరగా అయిపోయింది ఇంటర్వ్యూ" ఆశ్చర్యంగా పలుకరించింది కళ్ళజోడు శాల్తీ.

"లోపల ఒకాయనకు హార్ట్ ఎటాక్ వచ్చింది".

కళ్ళజోడు తెల్లబోయాడు "అరె మరి చెప్పరేం ?" అంటూ లోపలకు పరుగెత్తాడు.

సురేష్ రోడ్ మీదకొచ్చి నడవసాగాడు.

బాగా ఆకలి వేస్తోంది. జేబులో అయిదు రూపాయలే వుంది. అంచేత భోజనం మిస్ కొట్టాల్సిందే! ఫస్ట్ తారీఖుకి యింకా రెండు రోజులుంది. ఈలోగా మళ్ళీ తులసి దగ్గర డబ్బు తీసుకోవటం తనకిష్టం లేదు.

శ్రీనివాసా రెంటల్ ఏజన్సీకి చేరుకున్నాడతను. ముసలతను అతన్ని గుర్తు పట్టాడు.

"ఇల్లు నచ్చిందా?"

"రెండూ నచ్చినట్లే"

ఆయన తనవైపు అనుమానంగా చూడటం గమనించాడు సురేష్ .

"ఏమిటి రెండూ?"

"ఇల్లూ, ఇంటి ఓనర్ గంగాభవానిగారూ"

కర్చీఫ్‌తో మొఖం తుడుచుకున్నాడతను.

"లెటజ్ టాక్ ఓన్లీ బిజినెస్ ....... "

"అయామ్ టాకింగ్ ఓన్లీ బిజినెస్ ....... "

"మరి ఇంట్లో దిగుతున్నావా?"

"దిగనిస్తేనా?"

"ఎవరు?"

"గంగాభవానిగారు ....... "

"ఎందుకు?"

"నేను చెప్పిన నిజాలకూ, ఆమె కనుక్కున్న సత్యానికి చాలా తేడావుంది. అదీగాక ఆమె కట్టుకున్న చీర చాలా మందంగా వుంది".

ముసలాయనకేమీ అర్థం కావడం లేదు.

"ఇప్పుడేం చేయటం మరి?"

"ఇంకో ఇల్లు కావాలి."

అతను రిజిస్టర్ తిరగేశాడు చిరాగ్గా.

"ఆల్‌రైట్! కూకట్‌పల్లిలో ఇల్లు కావాలా?"

సురేష్ ఓ క్షణం ఆలోచించాడు.

"అక్కడయితే ఫ్రీగా దొరుకుతుంది కదూ?"

అతను రిజిస్టర్ మూసివేశాడు కోపంగా "అంతే యింకేంలేవు."

"అయితే మా పాతిక రూపాయలు యిచ్చేయండి."

"అదెలా ఇస్తాం?"

"చెక్ ద్వారాగానీ, క్యాష్ ద్వారా గానీ."

అతను మళ్ళీ రిజిస్టర్ చూశాడు కాసేపు.

"మీరు చెప్పిన రేటుకి ఓ యిరవై ఎక్కువ అద్దె ఫర్వాలేదా?"

"ఫర్వాలేదు"

"అయితే సీతాఫల్‌మండీలో వుంది ఓ యిల్లు" అంటూ ఓ ఉత్తరం, ఆ ఇంటి అడ్రస్ కాగితం మీద రాసి యిచ్చాడు.

బస్‌లో సీతాఫల్‌మండీ చేరుకున్నాడు సురేష్. అరగంట వెతికాక దొరికిందది. ఇల్లు బయటినుంచి చూస్తూనే అర్థమయిపోయింది.

ఉత్తరం చదివి "రండి" అన్నాడతను కిళ్ళీ వేసుకుంటూ.

సురేష్ లోపలకు నడిచాడు. గోడల నిండా మరకలు నిండిపోయినయ్. పెళ్ళలు చాలా చోట్ల ఊడినయ్. చీమలు, చెదపురుగులూ యిల్లంతా కనబడుతున్నాయ్.

"వరండా, ఈ గదీ, వంటిల్లూ ....... " అన్నాడతను కారా కిళ్ళీ నములుతూ.

"మరి సమాధులేవి?"

"సమాధులేమిటి?"

"ఈ ఇంట్లో ఇంతకు ముందున్న వాళ్ళవి ....... "

అతనికర్థం కాలేదు "మీరేమంటున్నారో తెలీటం లేదు."

"బహుశా వాళ్ళను చెద తినేసి వుంటుంది. అందుకని సమాధులు కట్టి వుండరు."

"ఏ విషయం మీరు మాట్లాడుతోంది?"

"శవాల గురించి ....... "

"శవాలేమిటి?"

"ఏమీ లేదు."

అతను అనుమానంగా చూశాడు గాని ఆ విషయం మళ్ళీ ప్రశ్నించదల్చుకోలేదు.

"కరెంట్‌కి పదిహేను, నీళ్ళకు పాతిక మీరే కట్టాలి."

"దహన సంస్కారాలకెవరిస్తారు?" అడిగాడు సురేష్.

"అంటే?" అయోమయంతో అడిగాడు యజమాని.

“స్మశానం దగ్గర్లో వుందా?”

“ఎందుకు?”

“దూరమయితే కష్టమని”

“అంటే ఎవరయినా జబ్బు మనిషి వున్నారా మీతో?”

“ఇంట్లో దిగితే ఎవరయినా అవక తప్పదు కదా”

“అవునవును. ఈ రోజుల్లో ఎప్పుడేమవుతుందో ఎవరు చెప్పగలరు?”

“ఈ ఇంట్లో దిగేవాళ్ళ గురించి మాత్రం ఖచ్చితంగా చెప్పవచ్చు” అని సురేష్ బయటకు నడుస్తూంటే అతను వెనుకే వచ్చాడు.

“ఇల్లు నచ్చిందా?”

“సూయిసైడ్ స్క్వాడ్స్ అని కొన్ని వుంటాయ్. వాటి మెంబర్లకు నచ్చకేమవుతుంది?”

“మరి ఎప్పుడు దిగుతున్నారు?”

“త్వరలోనే... కోరికలన్నీ చచ్చిపోయాక”

“మీరు తమాషాగా మాట్లాడుతున్నారు”

“ఇలాంటి యిళ్లల్లో దిగబోయే వాళ్ళంతే” నవ్వుతూ అన్నాడు సురేష్ .

“అడ్వాన్స్ యిస్తారా?”

“ఇంకా అడ్వాన్సెందుకు? మాకున్నదంతా ఎలాగూ మీదేగా ఇక. అవునూ-ఈ ఇల్లొకటేనా- ఇంకేమయినా పద్ధతులున్నాయా- ఇంట్లో దిగేవాళ్ళను అంతం చేయడానికి?”

“అంటే?” మళ్ళీ అనుమానంగా అడిగాడు.

“అంటే ఇతర గేమ్స్, స్పోర్ట్స్, వేటలాడటం లాంటివి! కొత్తవి ఏమయినా కని పెట్టినప్పుడు చెప్పండి! బలికి వస్తాం” అనేసి నిరాశగా బయటికొచ్చాడతను.

ఇలాంటి ఇళ్ళు ఈ వారంలో చాలా చూశాడతను. తులసిలాంటి అందమయిన దేవతను అలాంటి అనార్కలీ మోడల్ హౌస్‌లలో వుంచటం తనకు ససేమిరా యిష్టం లేదు.

చౌరస్తాకొచ్చి నిలబడ్డాడతను. తులసి ఆఫీస్ నుండి బయట పడడానికి ఇంకో అరగంట టైముంది. ఆమె దీప యింటినుంచి బయటపడడానికి ఇంక రెండే రెండు రోజుల టైమ్....

ఇప్పుడు తులసికి ఏమని చెప్పాలి? ఆ యిల్లు కూడా చేయి జారిపోయిందనా? తను ఉద్యోగాలకే కాదు-ఇళ్ళు వెతికేందుకు కూడా అనర్హుడనుకుంటుందేమో!

పక్కనే వున్న ఇరానీ హోటల్లో కూర్చున్నాడతను.

ఆకలి ఎదురుగ్గా టేబుల్ మీద క్యాబరే డాన్స్ చేస్తోంది.

“క్యా హోనా భాయ్?”

“సమోసా, చాయ్.”

చటుక్కున గుర్తుకొచ్చింది సురేష్‌కి.

"డోంట్‌వర్రీ సురేష్! ఇల్లు సమస్య సాల్వ్ అయిపోయింది. తులసి పొద్దున ఆ విషయం చెప్పింది కదా. ఆమె, ఆమె ఫ్రెండ్ విజయా కలసి ఓ ఇల్లు చూశారనీ, ఆ ఇల్లు నచ్చిందనీ."

అక్కడ సెటిల్ అయిపోవచ్చు.

తులసి దూరంగా జనప్రవాహం మధ్యలో ప్రత్యేకంగా, అందంగా, ఠీవిగా నడుస్తోంది. యస్! ఆమె అందానికో ప్రత్యేకత వుంది. అందుకే ఆమెని తన లైఫ్ పార్టనర్‌గా ఎన్నుకున్నాడు. లేచి హోటల్లోంచి బయటికొచ్చాడు. తులసి పక్కన దీప అందం వెలవెలపోతోంది.

"హలో...హలో" తులసినీ, దీపనూ పలకరించాడు.

"హలో" అది దీప అయిష్టంగా. తనంటే దీపకు ఎంత అయిష్టమో తనకు తెలుసు. ఆమె కెంత అయిష్టమో అంతగా టీజ్ చేస్తూంటాడు.

"మాకు ఇల్లు దొరకలేదు. కనుక మీరూ మీ భర్తా సంసారానికి రిబ్బన్ కత్తిరించే కార్యక్రమం ఇంకో ఆరునెలలు పోస్ట్‌పోన్ చేసుకోవాలి" సీరియస్‌గా అన్నాడు.

ఆమె ముఖంలో రంగులు మారాయి.

"తను నిన్నే వైజాగ్ నుంచి యిక్కడకు సామాను పంపించేశారు కదా?"

"అయితే మీరే వేరే ఇల్లు చూసుకోండి"

తులసి నవ్వేసింది.

"లేదా యింకో ఛాయిస్ కూడా వుంది"

"ఏమిటది?" అడిగింది దీప.

"మీ పెళ్ళి కాన్సిల్ చేసుకోవటం"

దీప మొఖంలో కోపం ఎరుపు రంగు గూడు కడుతోంది.

"ఏయ్!" అంది తులసి నవ్వేస్తూ.

"అయినా మీరు ఆ రోజే నా ప్రపోజల్‌కి వప్పుకుంటే ఈగొడవంతా లేకపోను కదా!"

దీప అసహనంగా చూసింది తులసి వైపు. ఆ మాట ఎత్తితేచాలు భరించరాని కోపం ఆ అమ్మాయికి.

"నేను వెళుతున్నాను"

"ఓ.కె. నేను యింకో గంటలో వచ్చి సామాను తీసికెళతాను" నవ్వాపుకుని చెప్పింది తులసి.

దీప విసురుగా నడిచిందక్కడినుంచి.

"దీపతో అలా మాట్లాడవద్దని చెప్పానా" బస్‌స్టాప్ వైపు నడుస్తూ అంది తులసి.

"మాటలతో ప్రారంభించకుండా డైరక్ట్‌గా కార్యక్రమంలోకి దిగితే బాగుండదు కదా."

మోచేత్తో సురేష్ నడుము మీద పొడిచిందామె.

"ఇంటికి అడ్వాన్స్ కట్టేశారా?"

"లేదు. ఆ ఇల్లు కాన్సిల్ చేసేశాను"

"ఎందుకని?"

"ఇంటావిడ అందంగా లేదు"

"ఆమె అందంతో నీకేమిటి పని?"

"తెల్లారి లేస్తే మేమిద్దరం ఒకరి ముఖం ఒకరు చూసుకోవాలి కదా. నువ్వు ఆఫీసుకెళతావు."

తులసి నవ్వేసింది.

"అసలు సంగతి ఏమిటంటే ఆవిడే ఇల్లు యివ్వనంది"

తులసి ఆగిపోయింది.

"ఎందుకని?"

"నేను ఆమెకి నచ్చలేదట"

"మరి ఇప్పుడెలా?"

"ఆ ఇల్లు కావాలంటే నన్ను మార్చేసి యింకొకతన్ని తెచ్చుకో"

"డోంటాక్!"

"నువ్వూ, మీ 28-24-28 యింకో ఇల్లు చూశావన్నారు కదా! ఆ ఇంటికి వెళదాం."

తులసి ఓ క్షణం ఆలోచించింది.

"సరే-పద"

ఇద్దరూ బస్‌లో బయల్దేరారు.

బస్ దిగి నడుస్తూంటే సురేష్‌కి అనుమానం వచ్చేసింది.

"మీరు చూసిన ఇంటి ఓనర్ పేరేమిటి?"

"ఎందుకు?"

"ఫర్ సేక్"

"గంగాభవాని"

ఠక్కున ఆగిపోయాడు సురేష్.

"తులసీ! నేనిక్కడే నిలబడతాను. నువ్వెళ్ళి అడ్వాన్స్ యిచ్చేసిరా"

"ఎందుకలా?"

"మా యిద్దరికీ సరిపడదు"

తులసి అనుమానంగా చూసింది. "నువ్వు చూసిన ఇల్లూ అదే కదూ?"

“అవును”

ఆమెకేం చేయాలో తెలీదు.

“తులసీ, ముందు వెళ్ళి అడ్వాన్స్ కట్టెయ్. రాత్రికి సామాను తెస్తున్నామని చెప్పు. ఉదయం నన్ను చూసినా అప్పుడిక ఏమీ ప్రాబ్లమ్ వుండదు. ముందు ఇల్లు దొరకడం ముఖ్యం.”

తులసి ఒంటరిగానే వెళ్ళి పావుగంటలో తిరిగి వచ్చింది.

“ఏమంది గంగాభవాని?”

“ఓ.కె అంది.”

“థాంక్ గాడ్! పెద్ద ప్రాబ్లమ్ సాల్వ్ అయిపోయింది. పద నీ రూంకెళ్ళి సామాను తీసుకొచ్చేద్దాం”